క్లుప్తంగా

నేడు పిడుగురాళ్లలో స్వచ్ఛతాహీ సేవ

పిడుగురాళ్ల: పట్టణంలో గురువారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం గురువారం ఉదయం 9 గంటలకు వాకింగ్ ట్రాక్ వద్ద ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కౌన్సిలర్లందరూ హాజరు కావాలని ఆయన సూచించారు.

ముస్లింలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



దాచేపల్లి: ఎన్నికల సమయంలో ముస్లింలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని వైఎస్సార్ సీపీ మండల కార్యదర్శి మోమిన్ నాగుల్ మీరా బుధవారం డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 50 ఏళ్లకే ముస్లింలకు పింఛన్ ఇస్తామని ఇచ్చిన వాగ్దానం నెరవేర్చాలన్నారు. నిరుద్యోగ యువతకు రుణాలు, ఇమామ్, మౌజాన్‌లకు గౌరవ వేతనాలు ఇవ్వాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇవేమీ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని అన్నారు. సర్కారు తీరు మారకుంటే దశలవారీగా ఉద్యమం చేపడుతామని పేర్కొన్నారు.

'రణభేరి'ని జయప్రదం చేయండి



మాచర్ల: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేసేందుకు రణభేరి కార్యక్రమం గురువారం నిర్వహించనున్నట్లు నాయకులు షేక్ నజీర్, నాసర్‌రెడ్డి, గాలిబ్‌సాహెబ్, నాగరాజులు బుధవారం తెలిపారు. యూటీఎఫ్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని సంఘాలను కలుపుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేస్తామన్నారు. గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు.

ఆధార్ కార్డు నమోదు కేంద్రాల ఏర్పాటు

మాచర్ల: పట్టణంలోని సచివాలయాల పరిధిలో ఆధార్ కార్డు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు బుధవారం తెలిపారు. 25, 26వ తేదీల్లో ఈ కేంద్రాలు అందుబాటులో ఉంటాయన్నారు. పట్టణంలోని రోప్‌వే కాలనీ, పూర్ణయ్య షెడ్డు బజారు, లింగ బలిజ కాలనీ సచివాలయాల్లో ఉదయం 10 – సాయంత్రం 5 గంటల వరకు ఆధార్ కార్డు నమోదు కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

వీధి దీపాలు వెలగక అవస్థలు



విజయపురిసౌత్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ విజయపురి సౌత్‌లో గత ఏడాదిగా వీధి దీపాలు వెలగకపోవటంతో ప్రజలు, పర్యాటకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇదే విషయాన్ని ఎమ్మార్పీఎస్ నాయకుడు ఊరే మార్కు బుధవారం విలేకరులకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఫిల్టర్ హౌస్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైపలు వీధుల్లో విద్యుత్ లైట్లు పనిచేయటం లేదన్నారు. లాంచీస్టేషన్, అంబేడ్కర్ సెంటర్, పుష్కరఘాట్, శివాలయం తదితర ప్రాంతాల్లో రాత్రి వేళ అంధకారం అలుముకుంటున్నట్లు చెప్పారు. సాగర్‌మాత దేవాలయం, తెల్లవారుజామున కృష్ణానది స్నానానికి వెళ్లే భక్తులు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. అంబేడ్కర్ సెంటర్‌లో హైమాస్ట్ దీపాలు వెలగకపోయినా ఎవరూ పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ఆయన కోరారు.

తల్లిపాలు అమృతంతో సమానం

అచ్చంపేట: తల్లిపాలు అమృతం లాంటివని, పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు తాగించాలని ఐసీడీఎస్ సూపరవైజర్ ఎస్.మాణిక్యం తెలిపారు. పోషణ మాసోత్సవాలలో భాగంగా మండలంలోని చామర్రులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లిపాలలో పోషక గుణాలు ఎక్కువగా ఉంటాయన్నారు. బిడ్డ ఎదుగుదలకు అవి దోహదపడతాయని, వ్యాధి నిరోధక శక్తిని కలిగి ఉంటాయని చెప్పారు.

గుక్కెడు తాగునీటికీ కష్టాలే!

- ఖాళీ బిందెలతో అద్దంకి – నార్కెట్‌పల్లి హైవేపై స్థానికుల నిరసన
- తాగునీరు సరఫరా చేయాలని డిమాండ్
- కాలనీలోని బోర్లలో నీరు కలుషితమైందని ఆవేదన



అద్దంకి - నార్కెట్‌పల్లి హైవేపై ఆందోళన చేస్తున్న దుర్గాభవాని కాలనీవాసులు

దాచేపల్లి: గుక్కెడు తాగునీటి కోసం ఇక్కడి ప్రజలు అల్లాడిపోతున్నారు. ప్రభుత్వ అధికారులకు.. ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా దాహార్తి మాత్రం తీర్చలేకపోయారు. దీంతో గత్యంతరం లేక రోడ్డు ఎక్కారు. అద్దంకి –నార్కెట్ పల్లి రహదారిపై దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని దుర్గాభవాని కాలనీవాసులు బుధవారం ఆందోళన చేశారు. తాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించారు. 20 రోజులుగా నీరు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాలనీలో రోడ్లు వేస్తామని, తాగునీరు అందిస్తామని మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకున్నారని.. ఇప్పటివరకు ఇటువైపు చూడలేదని కాలనీవాసులు మండిపడ్డారు.

ఈ కాలనీలో సుమారుగా 200 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. పైపుల ద్వారా గతంలో కృష్ణానది నీరుతోపాటు బోర్ల ద్వారా కూడా నీరు సరఫరా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాలనీ అభివృద్ధికి కనీస చర్యలు చేపట్టలేదు. బోర్లు మరమ్మతుకు గురైనా నిమ్మకు నీరెత్తినట్లు అధికారులు, నాయకులు ఉన్నారు. అప్పుడప్పుడు ట్యాంకర్ ద్వారా అరకొరగా నీటిని సరఫరా చేసి అధికారులు చేతులు దులుపుకొంటున్నారు. కాలనీలోని బోర్ల నుంచి వచ్చే నీరు సమీపంలోని రసాయన కర్మాగారాల వల్ల కలుషితం అవుతోందని స్థానికులు ఫిర్యాదు చేసినా ఎవరూ చర్యలు తీసుకోలేదు. నగర పంచాయతీ అధికారులు వచ్చి వారితో మాట్లాడారు. తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ నేపథ్యంలో హైవేపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది.



నిరుపయోగంగా ఉన్న మంచినీటి ట్యాంకు

తాగునీరు లేక అల్లాడిపోతున్నాం



మా కాలనీ అభివృద్ధిని ఎవరూ పట్టించుకోవడం లేదు. కనీసం తాగునీరు కూడా సక్రమంగా సరఫరా చేయడం లేదు. పైపుల ద్వారా అందించే నీళ్లు కూడా రాక ఇబ్బంది పడుతున్నాం. నీటి కోసం బిందెలు పట్టుకొని గంటల తరబడి పడిగాపులు కాస్తున్నాం. మా మొర ఎవరూ ఆలకించడం లేదు. అధికారులు, నాయకులు ఇటువైపే రావటం లేదు.

–మల్ల లక్ష్మి

కలుషిత నీటితో రోగాలు



కాలనీని ఆనుకుని రసాయన కర్మాగారాలు ఉన్నాయి. బోర్లలో నుంచి వచ్చే నీటిలో రసాయన వ్యర్థాలు కలవడం వలన నీరు కలుషితం అవుతోంది. అవి తాగితే ఒళ్లంతా దద్దుర్లు పడి పుండ్లు అవుతున్నాయి. ఆరోగ్యం సరిగా ఉండటం లేదు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన ఎవరూ పట్టించుకోవడం లేదు. తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలి.

– నల్లబోతుల రమణ

పైపులైన్లకు మరమ్మతులు చేయాలి



మా కాలనీని అధికారులు పట్టించుకోవటం లేదు. 200 కుటుంబాలు నివాసం ఉంటున్నా ఒక్క సిమెంట్ రోడ్డు కూడా లేదు. మంచినీటి పైపులు ఎక్కడికక్కడే మరమ్మతులకు గురయ్యాయి. వాటి గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇకనైనా పైపులైన్లు సరిచేయాలి. మా కాలనీ పట్ల ఎందుకు వివక్ష చూపుతున్నారో అర్థం కావడం లేదు.

– నల్లబోతుల గోవిందమ్మ

మాజీ సీఎం జగన్‌ను కలిసిన యెనుముల మురళీధర్‌రెడ్డి



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో మురళీధర్‌రెడ్డి, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

పిడుగురాళ్ల: తాడేపల్లిలోని జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని రాష్ట్ర కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గురజాల నియోజకవర్గంలోని పరిస్థితులను మాజీ సీఎంకు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి

సత్తెనపల్లి: పట్టణ ప్రజలు కాచి చల్లార్చిన తాగునీటినే తాగాలని మున్సిపల్ కమిషనర్ నంబూరి ఆనందరావు బుధవారం అన్నారు. పట్టణంలోని 31 వార్డుల్లో రక్షిత నీటి సరఫరా ద్వారా ప్రతిరోజు తాగునీరు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం వర్షా కాలం దృష్ట్యా ప్రజలు తాగునీటిని కాచి వడపోసి తాగాలన్నారు. మంచినీరు ఎక్కడైనా అనివార్య కారణాల వలన కుళాయిల ద్వారా కలుషితమైన నీరు వస్తే వెంటనే పురపాలక సంఘంలోని సిబ్బందికి తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలు తాగునీటి విషయంలో అశ్రద్ధ చేయకుండా చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

ఘనంగా దేవీనవరాత్రులు



రెంటచింతల: శ్రీ మహా చండీదేవి అలంకారంలో వాసవి కన్యకాపరమేశ్వరి



మాచవరం: సంతాన లక్ష్మిగా భక్తులకు దర్శనమిస్తున్న వాసవి అమ్మవారు

పిడుగురాళ్ల /పిడుగురాళ్ల రూరల్:/మాచవరం /కారెంపూడి: పిడుగురాళ్ల పట్టణంలో దేవి నవరాత్రులు ఘనంగా నిర్వహించారు. యమజ జారులోని ఉన్న మహాలక్ష్మీ దేవాలయం వద్ద అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు భారీగా తరలివచ్చి కుంకుమ పూజ చేశారు. గంగమ్మ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. సత్యసాయి దేవాలయంలో అమ్మవారిని నిమ్మకాయలతో ప్రత్యేకంగా కొలువుదీర్చారు. జానపాడు రోడ్డులోని వాసవి అమ్మవారిని మహిషాసుర మర్దినిగా అలంకరించగా, భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి దర్శనం చేసుకున్నారు. బ్రహ్మంగారి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. భవానీనగర్‌లో కనకదుర్గ అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా కొలువుదీర్చారు. వెంకటేశ్వర స్వామి దేవాలయంలో అమ్మవారు వరాహ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నాగుల గుడిలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులను కరుణించారు.

సంతాన లక్ష్మిగా వాసవి అమ్మవారు

పిడుగురాళ్ల రూరల్ మండలంలోని వాసవీ ఆర్య వైశ్య కల్యాణ మండపంలో దేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మూడవ రోజు వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని సంతానలక్ష్మిగా కొలువుదీర్చారు. భ్రమరాంబ సమేత చెన్న మల్లేశ్వర స్వామి దేవస్థానంలో దేవి నవరాత్రులను ఘనంగా నిర్వహించారు. భ్రమరాంబను గాయత్రీదేవిగా అలంకరించారు.

అన్నపూర్ణాదేవిగా పార్వతీదేవి

మాచవరం మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలోని గంగ పార్వతి సమేత సోమేశ్వరస్వామి దేవాలయంలో దేవి నవరాత్రులు వైభవంగా నిర్వహించారు. అందులో భాగంగా పార్వతీదేవిని బుధవారం అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. కుంకుమ పూజ, అభిషేకాలు చేశారు.

లలితాదేవి అలంకరణలో కనక దుర్గమ్మ

రెంటచింతల: దేవి శరన్నవరాత్రులలో భాగంగా బుధవారం మండలంలోని పాలువాయి జంక్షన్ వద్ద త్రిశక్తి పీఠంగా విరాజిల్లుతున్న శ్రీకనకదుర్గ దేవస్థానంలో అమ్మవారు లలితాదేవి అలంకారంలో, రాజమాతాంగి దేవి అలంకారంలో సరస్వతీ దేవి, గజలక్ష్మీదేవిగా లక్ష్మీదేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 6 గంటల నుంచే భక్తులు తరలి వచ్చారు. ప్రధాన అర్చకుడు చుండు సాంబశివశాస్త్రి నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమ పూజ, హోమాలు జరిగాయి. భక్తులు రథోత్సవంలో భారీగా పాల్గొన్నారు. మధ్యాహ్నం దాతల సహకారంతో 800 మంది అన్నదానం చేపట్టారు. దేవస్థానం వ్యవస్థాపక అధ్యక్షుడు యేచూరి సాంబశివరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సత్రశాలలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో భ్రమరాంబిక అమ్మవారు అన్నపూర్ణాదేవిగా పూజలు అందుకున్నారు. శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు శ్రీ మహా చండీదేవిగా భక్తులకు దర్శనమించారు. దేవస్థానం అధ్యక్షుడు కట్టమూరి వెంకట నాగేశ్వర రావు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గాయత్రీదేవిగా పల్నాటి వీర్ల అంకాలమ్మ బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. పూజారులు భక్తుల గోత్ర నామాలతో అర్చనలు చేసి, తీర్థ ప్రసాదాలు అందించారు. శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయంలో, శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో, పలు గ్రామాలలో పూజలు చేశారు. వాడవాడలా బతుకమ్మ వేడుకలు కూడా కొనసాగుతున్నాయి.

మాచర్ల రూరల్: విజయదశమి మహోత్సవాన్ని పురస్కరించుకొని దేవీ నవరాత్రుల ఉత్సవాలు కొత్తపల్లి, కంభంపాడు గ్రామాలలో బుధవారం వైభవంగా ప్రారంభించారు. అమ్మవారిని శ్రీ కాళికాదేవిగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపల్లి గ్రామంలో ఆలయ పూజారి గిరిశర్మ నేతృత్వంలో చక్కెరపొంగలి, పులిహోర నైవేద్యంగా పెట్టారు.



పిడుగురాళ్ల వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వరాహ అవతారంలో అమ్మవారు



పిడుగురాళ్ల బ్రహ్మంగారి దేవాలయంలో అన్నపూర్ణాదేవిగా అమ్మ వారు

ప్రత్యేక పూజలు

దాచేపల్లి: స్థానిక రెడ్ల బజారులోని డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. స్థానిక వీర్ల అంకమ్మ తల్లి, కన్యకా పరమేశ్వరి దేవాలయంలో కూడా శరన్నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి.



దాచేపల్లి: రెడ్లబజారులో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు





వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం బుధవారం ఉదయం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. - సాక్షి నెట్ వర్క్

వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటా



రెంటాల మాజీ సర్పంచ్ కటికల భాగ్యమ్మ భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న పీఆర్కే



చికిత్స పొందుతున్న పాతపాటి వెంకటేశ్వర రెడ్డిని పరామర్శిస్తున్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

పార్టీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

రెంటచింతల/మాచర్ల: కష్టకాలంలో ఉన్న వైఎస్సార్‌సీపీ ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటానని పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని రెంటాల గ్రామ మాజీ సర్పంచ్ కటికల భాగ్యమ్మ భౌతికకాయాన్ని ఆయన బుధవారం సందర్శించారు. పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీ అన్నివిధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

- ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన అంబన్నను కూడా పిన్నెల్లి పరామర్శించారు. అనారోగ్యం కారణంగా నరసరావుపేటలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రెంటచింతల మండలం రెంటాల గ్రామానికి చెందిన పాతపాటి వెంకటేశ్వర రెడ్డిని ఆయన పరామర్శించారు. పీఆర్కే వెంట వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, పెదకూరపాడు, వినుకొండ నియోజకవర్గాల పరిశీలకుడు యెనుముల మురళీధర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర యువజన నాయకుడు నవులూరి చెన్నారెడ్డి, సర్పంచ్ కిరణ్, పార్టీ నాయకులు పేరం పెదసీతారామిరెడ్డి, పాతపాటి పిచ్చిరెడ్డి, మరియదాసు తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం



కరాలపాడు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ రవి



పాతగణేశునిపాడు గ్రామంలో రోగులతో మాట్లాడుతున్న వైద్యులు

పిడుగురాళ్ల/ పిడుగురాళ్ల రూరల్/మాచవరం: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి రవి అన్నారు. మండలంలోని కరాలపాడు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. రెండు నుంచి మూడు రోజులపాటు జ్వరం ఉంటే వెంటనే స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. దోమ కాటుకు గురి కాకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం రక్త పరీక్షలు నిర్వహించే ల్యాబ్‌ను, మెడికల్ స్టోర్‌ను పరిశీలించారు. అధిక రక్తపోటు, మధుమేహ రోగుల రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఐవో అధికారి డాక్టర్ హనుమకుమార్, కరాలపాడు ఆరోగ్య కేంద్ర వైద్యులు కేవీ ప్రవీణ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మలేరియా విషయంలో జాగ్రత్త

మలేరియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎండీ గౌస్ అన్నారు. మండలంలోని పాతగణేశునిపాడు గ్రామాన్ని బుధవారం వైద్యసిబ్బంది సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామంలో సీజనల్ వ్యాధులు మాత్రమే ఉన్నాయని చెప్పారు. ప్రజలను దోమ తెరలు వాడాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించామని తెలిపారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా జనార్దన్



పిడుగురాళ్ల: పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం బుధవారం నిర్వహించారు. నూతన లయన్స్ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల (అక్షయ) క్లబ్ అధ్యక్షుడిగా ఆవుల జానర్దన్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ విజయ్‌చంద్, ఆర్.లక్ష్మి, ఎన్.కోటేశ్వరమ్మ, ఎస్.వెంకట్రావు, సతీష్‌లు ఉన్నారు. అనంతరం సెక్రటరీగా కోడూరి కాశీశంకర్, ట్రెజరర్‌గా శిష్టల వెంకట పట్టాభిరామశాస్త్రి, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

స్థలాలను లబ్ధిదారులకు అప్పగించాలి

నకరికల్లు: ప్రభుత్వం ద్వారా హక్కులు పొందిన పేదల నివేశన స్థలాలను ఆక్రమణదారుని చెర నుంచి విడిపించి లబ్ధిదారులకు అప్పగించాలని పీడీఎం రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు కోరారు. లబ్ధిదారుల స్థలాన్ని ఇప్పించాలంటూ తహసీల్దార్ కె.పుల్లారావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1989లో అప్పటి ప్రభుత్వ హయాంలో మండలంలోని బాలాజీనగర్‌తండాలోని బంజారా తెగకు చెందిన 37 కుటుంబాల్లోని పేదలకు గ్రామంలోని గ్రామకంఠం నంబర్ 666లో గల 1.25 ఎకరాలలో 37 కుటుంబాలకు నివేశనాస్థలాలు మంజూరు చేసినట్లు తెలిపారు.